క్లుప్తంగా

ప్రజల మద్దతుతో పోరాటం



వైఎస్సార్‌సీపీ అధినేతను కలసిన మల్లం చంద్రమౌళి రెడ్డి, శంకర్ యాదవ్

చంద్రగిరి: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై చంద్రగిరి నియోజకవర్గంలో ప్రజల మద్దతుతో పోరాటం చేస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మల్లం చంద్రమౌళి రెడ్డి, పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. గురువారం ఆయన, బీసీ నేత శంకర్‌యాదవ్‌తో కలసి తాడేపల్లిలో పార్టీ అధినేతను కలిశారు. మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా నియోజకవర్గవ్యాప్తంగా ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తున్నారన్నారు. అలాగే జిల్లాలో మామిడి రైతులు తీవ్రంగా నష్టపోతున్న నేపథ్యంలో రైతుల కోసం నిరంతరం పోరాటం చేయాలని పార్టీ అధినేత వారికి సూచించారు.

బంగారు తిరుచ్చిపై సూర్య నారాయణుడు



భక్తులను దర్శనమిస్తున్న సూర్య భగవానుడు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ అనుబంధ శ్రీసూర్యనారాయణ స్వామి గురువారం సాయంత్రం బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. తొలుత వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు, స్వామివారి జన్మనక్షత్రమైన హస్త సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని వజ్ర వైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం బంగారు తిరుచ్చి వాహనంపై విహరించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్లు రమేష్, ప్రసాద్, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఎగ్జామినేషన్ డీన్‌గా అనురాధ



డీన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ అనురాధ

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీ సోషల్ వర్క్ విభాగపు అధ్యాపకురాలు ప్రొఫెసర్ అనురాధ వర్సిటీ ఎగ్జామినేషన్ డీన్‌గా నియమిస్తూ గురువారం వీసీ ప్రొఫెసర్ ఉమ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు డీన్‌గా ప్రొఫెసర్ జీవన్ జ్యోతి రెండేళ్ల పాటు కొనసాగారు. ఆమె నుంచి ప్రొఫెసర్ అనురాధ బాధ్యతలు స్వీకరించారు.

నటుడు, దర్శకుడు భరద్వాజ్‌కు సత్కారం



భరద్వాజ్‌ను ఎస్వీఆర్ పురస్కారంతో సత్కరిస్తున్న రంగస్థలి కళాకారులు

తిరుపతి కల్చరల్: ప్రముఖ నటుడు ఎస్వీరంగారావు జయంతి పురస్కరించుకుని రాయలసీమ రంగస్థలి ఆధ్వర్యంలో నటుడు, సంగీత విద్వాంసుడు, దర్శకుడు భరద్వాజ్‌ను ఎస్వీఆర్ స్మారక పురస్కారంతో గురువారం సత్కరించారు. తొలుత ఎస్వీ రంగారావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, కళాకారులు కేఎన్.రాజా, పద్మనాభం, వాసుదేవరెడ్డి, కృష్ణమూర్తిరెడ్డి, రేవతి, మునిమోహన్, విజయసింహారెడ్డి, సిద్ధవరం వెంకటాద్రి, తిరుపాలాచారి, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

మళ్లీ మృత్యువును జయించాడు!



అమర హాస్పిటల్ నుంచి డిశ్చార్జవుతున్న భాస్కరనాయుడు


తిరుమల: నాగుపాము కాటుకు గురైన టీటీడీ అటవీశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్ నాయుడు (68) మరోసారి మృత్యువును జయించారు. ఇటీవల ఆయన విష నాగు కాటుకు గురవడం విదితమే. అమర హాస్పిటల్లో చికిత్స పొంది గురువారం డిశ్చార్జ్ య్యారు. వైద్యుల చికిత్సతో ఆయన కోలుకున్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం సాధారణ స్థితికి చేరుకోవడంతో డిశ్చార్జి చేశారు. గతంలో పాము కాటుకు గురై కొన్ని నెలల పాటు ఆస్పత్రిలో ఆయన మృత్యువుతో పోరాడటం తెలిసిందే. ఏ ఆస్పత్రిలో అయితే బతికి బట్టకట్టారో మళ్లీ అదే ఆస్పత్రి ఆయనకు జీవితాన్నిచ్చింది.

అగరాలలో కూటమి నేతల కక్షసాధింపు

- కనెక్షన్ ఇచ్చిన మీటర్లు రద్దు చేయాలని కుటిల యత్నం
- ఒత్తిళ్లకు తలొగ్గి ట్రాన్స్‌కో అధికారులకు ఫిర్యాదు చేసిన పంచాయతీ ఈఓ



విద్యుత్ మీటర్లను ఎలా తొలగిస్తారంటూ ట్రాన్స్‌కో ఏఈని ప్రశ్నిస్తున్న అగరాల సర్పంచ్ భాస్కర్ రెడ్డి



గత నెల 24న పంచాయతీ ఈఓ ఇచ్చిన ఎన్‌ఓసీ

చంద్రగిరి: మండలంలోని అగరాల పంచాయతీలో కూటమి నేతల కక్ష సాధింపుకు అమాయక ప్రజలు బలవుతున్నారు. పంచాయతీకి చెందిన బషీర్, షరీఫ్ ఇటీవల ఇంటి నిర్మాణం పూర్తి చేసి విద్యుత్ మీటర్ కనెక్షన్ నిమిత్తం పంచాయతీ ఈఓకు అర్జీలు ఇచ్చారు. దీంతో గత నెల 24న పంచాయతీ ఈఓ సుబ్రమణ్యం లబ్ధిదారులకు ఇళ్లకు విద్యుత్ మీటర్లు అమర్చేందుకు అభ్యంతరం లేదంటూ ఎన్‌ఓసీ ఇచ్చారు. అనంతరం లబ్ధిదారులు 25న మీ–సేవ కేంద్రంలో విద్యుత్ మీటర్ కనెక్షన్ కోసం చలానా చెల్లించడంతో 27న ట్రాన్స్‌కో అధికారులు మీటరు అమర్చారు. అయితే తమను సంప్రదించకుండా విద్యుత్ మీటర్ పొందారని స్థానిక కూటమి నేతలు ఆగ్రహించారు. అధికారం అడ్డు పెట్టుకుని విద్యుత్ మీటర్లు కనెక్షన్ రద్దు చేయాలని పంచాయతీ ఈఓపై ఒత్తిడి తీసుకొచ్చినట్లు ప్రచారంలోకి వచ్చింది. ఈ క్రమంలో విద్యుత్ మీటర్లను రద్దు చేయాలని ట్రాన్స్‌కో సిబ్బందికి లేఖ అందజేశారు. సమాచారం తెలుసుకున్న సర్పంచ్ భాస్కర్ రెడ్డి గురువారం సాయంత్రం ట్రాన్స్‌కో కార్యాలయానికి వెళ్లారు. పేదలు ఇళ్లు నిర్మించుకుంటే రాజకీయ కక్ష సాధింపులో విద్యుత్ మీటర్లను తొలగిస్తామనడం దారుణమంటూ మండిపడ్డారు. దీనిపై పంచాయతీ ఈఓను వివరణ కోరగా.. సరైన పత్రాలు ఇవ్వకపోవడంతోనే ఎన్‌ఓసీ జారీ చేశానని, ఎస్సీల భూములను కొనుగోలు చేయడంతోనే వాటిని రద్దు చేసినట్లు తెలిపారు. అయితే పంచాయతీ వ్యాప్తంగా ఎస్సీల వద్ద కొనుగోలు చేసిన స్థలాల్లోనే కూటమి నేతలు సైతం ఇళ్లు నిర్మించుకున్నా చర్యలు తీసుకోకపోవడం గమనార్హం!

సౌకర్యాల కల్పనలో అలసత్వం వహించొద్దు



వార్డు పర్యటనలో రోడ్ల స్థితిని పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి తుడా: ప్రజలకు అవసరమైన సౌకర్యాల కల్పనలో అలసత్వం వహించరాదని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్ మౌర్య అధికారులను అన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో భాగంగా గురువారం రెండవ వార్డులోని రాజీవ్ గాంధీ కాలనీ, గొల్లవానికుంట, లీలామహల్ సమీపంలోని మధురానగర్ తదితర ప్రాంతాల్లో ఆమె పర్యటించారు. ప్రజలు ఆమె దృష్టికి పలు సమస్యలను నివేదించారు. సీసీ రోడ్లు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, తవ్వి వదిలేసిన రోడ్లు పూడ్చాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ పైవిధంగా అధికారులను హెచ్చరించారు. క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని, పారిశుద్ధ్యం మెరుగు పరచాలని, తాగునీరు సరైన సమయంలో సరఫరా చేయాలని, భూగర్భ డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ తులసి కుమార్, రెవెన్యూ ఆఫీసర్ సేతు మాధవ్, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, అధికారులు పాల్గొన్నారు.

సేవారంగంతోనే సమగ్రాభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి తుడా: సేవారంగం బలోపేతంతోనే తిరుపతి సమగ్రాభివృద్ధి సాధిస్తుందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్ మౌర్య పేర్కొన్నారు. తిరుపతి నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ కమిటీ సమావేశం గురువారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. వికసిత్ భారత్ 2047 నాటికి నియోజకవర్గం ఏవిధంగా, ఏఏ రంగాల్లో అభివృద్ధి చెందుతుందనే అంచనాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్‌తో వార్డు కార్యదర్శులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే, కమిషనర్ మాట్లాడారు. 2029 నాటికి 10 మార్గదర్శకాల అమలుతో తిరుపతి అభివృద్ధిలో కీలక మైలురాయిని చేరుకోవడం సాధ్యమన్నారు.. తిరుపతిలో నూతన రైల్వే స్టేషన్ అందుబాటులోకి రావడంతో పాటు త్వరలో ఇంటిగ్రేటెడ్ బస్టాండ్ నిర్మాణం పనులకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. రేణిగుంట–చంద్రగిరి ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ కోసం కేంద్ర ప్రభుత్వం ముందుకొచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్తాఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

9న సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

–జిల్లా సదస్సులో కార్మిక సంఘాల నేతలు పిలుపు



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: కార్మికుల హక్కులను కాలరాస్తూ ఎన్‌డీఏ ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలనే డిమాండ్‌తో ఈనెల 9న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నేతలు పిలుపునిచ్చారు. సమ్మెకు మద్దతుగా గురువారం వేమన విజ్ఞాన కేంద్రంలో జిల్లా స్థాయి సదస్సు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రమణ్యం, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా నేత వెంకటరత్నం మాట్లాడారు. ప్రస్తుతం ఎన్‌డీఏ ప్రభుత్వం కార్మికుల హక్కులన్నింటినీ హరించేలా 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా మార్చి అమలుకు పూనుకోవడం దుర్మార్గమన్నారు. ప్రధానంగా 29 కార్మిక చట్టాలులోని కార్మిక హక్కులు అన్నీ యాజమాన్యాలకు అనుగుణంగా మార్చివేస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్, గ్రాట్యుటీ వంటి సౌకర్యాలన్నింటినీ యాజమాన్యాల దయాదాక్షిణ్యాలపై ఆధారపడేలా మార్పులు చేశారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో 9న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు సుబ్రమణ్యం, బుజ్జి, చిన్న, మునిరాజ, నరేంద్ర, శ్రీరాములు, దాసు, వాసు, శేషయ్య, మాధవ్, ఏఐటీయూసీ నేత కేవై.రాజా, ఐఎఫ్‌టీయూ లోకేష్, మురళీధర్ పాల్గొన్నారు.

జ్ఞాన సంపదకు నిలయం సంస్కృత వర్సిటీ



మాట్లాడుతున్న వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

తిరుపతి సిటీ: జాతీయ సంస్కృత వర్సిటీ జ్ఞాన సంపదకు నిలయమని, సంస్కృత భాషాభివృద్ధిలో దినదినాభివృద్ధి చెందడం ఆనందంగా ఉందని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అన్నారు. ఇటీవల అహోబిలం మఠం నుంచి ప్రతిష్టాత్మకమైన బిరుదులు అందుకున్న పలువురు ఆచార్యులను ఆయన గురువారం సత్కరించి అభినందించారు. బిరుదాంకితులైన విశిష్టాద్వైత వేదాంత విభాగ అధ్యక్షులు ఆచార్యులు కేఈ దేవనాదన్, ఆగమ విభాగ ఆచార్యులు దర్శన స్కూల్ డీన్ విష్ణు భట్టాచార్యులు, దూరవిద్య విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ రంగనాథన్, మీమాంస విభాగ అధ్యక్షులు డాక్టర్ టీఏస్ఆర్ నారాయణను వర్సిటీ తరఫున సన్మానం అందుకున్నారు. అనంతరం వీసీ మాట్లాడుతూ, సంస్కృత వర్సిటీ జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం వర్సిటీలోని అధ్యాప, అధికారుల బృందం సమష్టి కృషి ఉందన్నారు. అనంతరం ఇటీవల నేపాల్‌లో జరిగిన 19వ ప్రపంచ సంస్కృత సదస్సులో నిర్ణయించిన పలు అంశాలను వీసీ అధ్యాపకులకు వివరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకట నారాయణ రావు, డీన్ రజనీకాంత్ శుక్ల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ల రద్దుకు 9న దేశవ్యాప్త సమ్మె

- కరపత్రాలు విడుదల చేసిన ఆప్కాస్, కాంట్రాక్ట్ ఉద్యోగుల జేఏసీ



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

తిరుపతి సిటీ: పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లను తీసుకొచ్చిందని, వాటిని రద్దు చేయాలని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ, ఆప్కాస్ సంస్థల నాయకులు డిమాండ్ చేశారు. 9న దేశ వ్యాప్త సమ్మెకు మద్దతుగా గురువారం ఎస్వీయూలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశవ్యాప్తంగా లేబర్ కోడ్స్ అమలులోకి వస్తే కార్మికులకు రక్షణ, ఆరోగ్య భద్రత, పనిగంటలు, వారాంతపు సెలవులు, ప్రత్యేక సెలవులు తదితర హక్కులను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయకపోవడం కోర్టు ధిక్కారమేనని మండిపడ్డారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర, అప్కాస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు చిన్నబాబు, ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గండికోట నాగ వెంకటేష్, ఎస్వీయూ వర్క్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజేంద్ర, కార్యదర్శి మురగయ్య, కోశాధికారి గణేష్, కమిటీ సభ్యులు రవి తదితరులు పాల్గొన్నారు..

ఎన్‌ఐఐఎంహెచ్‌తో వేదిక్ వర్సిటీ ఒప్పందం



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వీసీ, రిజిస్ట్రార్, ఎన్‌ఐఐఎంహెచ్ జాయింట్ డైరెక్టర్

తిరుపతి సిటీ: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్ (ఎన్‌ఐఐఎంహెచ్)తో ఆయుర్వేద విజ్ఞానంపై ఎస్వీ వేదిక్ వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. వర్సిటీలో వీసీ రాణి సదాశివమూర్తి, రిజిస్ట్రార్ డాక్టర్ భాస్కరుడు, ఎన్‌ఐఐఎంహెచ్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ గోలి పెంచల ప్రసాద్ ఒప్పందపు పత్రాలపై సంతకాలు చేశారు. వీసీ మాట్లాడారు. ఇరువురి ఒప్పందంతో కీలకమైన అంశాలు, ఆ అంశాలపై చేసే పరిశోధనలు, వాటి వలన కలిగే విస్తృత ప్రయోజనాల గురించి వివరించారు. వేద జ్ఞానాన్ని ఆయుర్వేద, వారసత్వ పరిశోధనలతో సమన్వయం చేయడం, ప్రధాన వృక్షాలు, లోహాలు, ఖనిజాలు, జంతు ఉత్పత్తులు, ఇతర పూజా సామగ్రి వంటి స్థానిక సంప్రదాయాలను డాక్యుమెంట్ చేయడం, వైదిక గ్రంథాల్లో ఉన్న మూలలను శోధించి శాస్త్రీయతను నిరూపణ చేయటం..ఇత్యాది వాటి గురించి చెప్పారు. కార్యక్రమంలో పరిశోధన డైరెక్టర్ డాక్టర్ రాధేశ్యామ్, డాక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మొగరాల హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన

పాకాల : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కారాదని ఈగల్ క్లబ్స్ (ఎలైట్ యాంటీ–నార్కొటిక్స్ గ్రూప్ ఫర్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ క్లబ్స్) సమన్వయకర్త వి. వెంకటసిద్దులు అన్నారు. మత్తు పదార్థాల వినియోగంతో కలిగే అనర్థాలపై గురువారం మొగరాలలో విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, పొగాకు ఉత్పత్తులు, గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులను కూడా తల్లిదండ్రులు ఓ కంట కనిపెడుతూ ఉండాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుమలత, ఉపాధ్యాయులు సుల్తాన్, నీరజ, ప్రమోదిని, రామమూర్తి, విమలా విక్టోరియా, ఆదికేశవులు, బాబు పాల్గొన్నారు.

పాకాలలో..

డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని సీఐ సుదర్శన్ ప్రసాద్ హెచ్చరించారు. డ్రగ్స్ వినియోగం–అనర్థాలపై గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈగల్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ మాసులామణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతిభా పరీక్షకు విశేష స్పందన



ప్రతిభా పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తిరుపతి కల్చరల్: అల్లూరి సీతారామరాజు జయంతి పురస్కరించుకుని వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గురువారం తిరుపతిలో వివిధ స్కూళ్లలో నిర్వహించిన ప్రతిభా పరీక్షకు విశేష స్పందన లభించింది. ×అల్లూరి జీవితం, స్వాతంత్య్రోద్యమంలో వారి పాత్ర, మన్యం పోరాట గాథలు¥ ఇత్యాది అంశాలపై ఈ పరీక్ష చేపట్టారు. వివిధ స్కూళ్లలో వందలాది మంది విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున మాట్లాడుతూ, విద్యార్థుల్లో అల్లూరి పోరాట స్ఫూర్తిని నింపే లక్ష్యంతో ఈ పరీక్షలు నిర్వహించామని, విజేతలకు శుక్రవారం అల్లూరి 128వ జయంతి సభలో బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో కేంద్రం ప్రతినిధులు పంచముఖేశ్వరరావు, నెల్లూరు మునిలక్ష్మి, నడ్డి నారాయణ, ప్రమోద్, వెంకటరమణ, కుప్పస్వామి, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తిరుపతి-అదిలాబాద్ రైళ్లకు కోచ్‌ల ఏర్పాటు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుపతి–అదిలాబాద్, అదిలాబాద్–నాందేడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోచ్‌ల వివరాలను ప్రకటించారు. ఈ మేరకు గురువారం దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం తిరుపతి–అదిలాబాద్ (17405), అదిలాబాద్–తిరుపతి (17406) మధ్య నడిచే రైళ్లకు ప్రస్తుతం ఏసీ త్రీ టైర్ 3, స్లీపర్ క్లాస్4, సెకండ్ క్లాస్ చైర్ కార్ 10, జనరల్ క్లాస్ 4 ఉన్నాయి. అయితే ఈ నెల 7 నుంచి సెప్టెంబర్ 2వ తేదీ వరకు మార్పు చేశారు. ఏసీ త్రీ టైర్ 3, స్లీపర్ క్లాస్ 8, సెకండ్ క్లాస్ చైర్ కార్ 6, జనరల్ సెకండ్ క్లాస్ 4 గా కోచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. ఇక, అదిలాబాద్–నాందేడ్ (17409), హెచ్ నాందేడ్–అదిలాబాద్ (17410) మధ్య నడిచే రైళ్లకు కూడా ఇదే విధానం కొనసాగనుంది.

పోలీసులు అదుపులో గంజాయి విక్రేత

చంద్రగిరి: యువకులను మత్తుకు బానిసలు చేసి, వారికి గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని తిరుచానూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మూడు రోజుల క్రితం గ్రాండ్ రిడ్జ్ సమీపంలో యువకులు గంజాయి సేవించడాన్ని డ్రోన్ నిఘాతో పోలీసులు గుర్తించారు. అనంతరం యువకులను తిరుచానూరు పోలీసు స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. తమిళనాడుకు చెందిన ఓ వ్యక్తి గంజాయి వారికి విక్రయించినట్లు తేలడంతో గురువారం అదే భవనం వద్ద పోలీసులు నిఘా పెంచారు. డ్రోన్ సాయంతో పరిశీలించగా, ఓ ఆగంతకుడు ఆ భవనం వద్ద ఉన్నట్లు గుర్తించి, స్పెషల్ పార్టీ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని గంజాయి ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో అతడు తమిళనాడుకు చెందిన వ్యక్తి అని తేలింది. గతంలో తిరుచానూరు పోలీసు స్టేషన్‌లో గంజాయి కేసులోనూ అతడిపై కేసు ఉన్నట్టు గుర్తించారు. గంజాయి విక్రయాల వెనుక ఉన్న ముఠాను పట్టుకోవడానికి పోలీసులు యత్నిస్తున్నారు.

అగ్నిప్రమాదం దురదృష్టకరం

–మేయర్ డాక్టర్ శిరీష



ప్రమాదానికి గురైన షాపును పరిశీలిస్తున్న మేయర్ డాక్టర్ శిరీష

తిరుపతి తుడా: స్థానిక గోవింద రాజస్వామి దేవాలయ ప్రాంగణంలో సన్నిధి వీధిలో అగ్ని ప్రమాదం సంభవించడం దురదృష్టకరమని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష వ్యాఖ్యానించారు. ప్రమాదం చోటు చేసుకున్న సన్నిధి ప్రాంతంలోని దుకాణాన్ని, ఇతర దుకాణాలను ఆమె నగర పాలక సంస్థ విపత్తు నివారణ, అగ్ని మాపక శాఖ అధికారి శ్రీనివాసరావుతో కలిసి గురువారం పరిశీలించారు. ప్రమాదానికి దారితీసిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆమె మాట్లాడుతూ, భక్తుల సందర్శన ఎక్కువగా ఉంటున్న తరుణంలో దుకాణదారులు అగ్నిమాపకశాఖ నిబంధనలు పాటించాలన్నారు. బుధవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదాన్ని సకాలంలో నివారించిన సంబంధిత శాఖల అధికారులను, సిబ్బందిని మేయర్ అభినందించారు. ఈ ఘటన నేపథ్యంలో నగరంలోని కీలక ప్రాంతాలలో ఉన్న షాపులలో నిబంధనలు పాటించే విధంగా చూడాలని, మొత్తం నగర పరిధిలో వాస్తవ పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

వైభవం..పార్వేట ఉత్సవం



పంచాయుధాలను ధరించి పార్వేటకు వెళ్తున్న లోకరక్షకుడు

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి పార్వేట ఉత్సవాన్ని శ్రీవారిమెట్టు సమీపంలో గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తుల ఊరేగింపు పార్వేట మండపానికి చేరుకుంది. అక్కడ క్షేమ తలిగ నివేదన చేసి పార్వేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో దుష్టశిక్షణ కోసం స్వామివారు పంచాయుధాలను ధరించి మూడుసార్లు బల్లెంను ప్రయోగించారు. ఆస్థానం అనంతరం సాయంత్రం ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కళాకారులు భక్తి సంకీర్తనలు ఆలపించారు. భజన బృందాలు భజనలు, కోలాటాలు చేశారు. ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపినాథ్ పాల్గొన్నారు.

స్విమ్స్ కార్మికులకు అండగా వైఎస్సార్‌సీపీ

– టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి



సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా మాట్లాడుతున్న భూమన కరుణాకర రెడ్డి

తిరుపతి తుడా : టీటీడీ స్విమ్స్ యూనివర్సిటీలో ఆందోళనకు దిగిన కార్మికులకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని ఆ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు , టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. న్యాయమైన డిమాండ్లతో ఆందోళనకు దిగిన కార్మికులకు తమ పార్టీ అండగా ఉంటుందని భూమన భరోసా ఇచ్చారు. ఈ మేరకు నిరసన దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి వారికి మద్దతును ప్రకటించారు. కార్మికుల డిమాండ్లను ఆయన అడిగి తెలుసుకున్నారు.

సుకన్యకు డాక్టరేట్



తిరుపతి సిటీ: ఎస్వీయూ జంతు శాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థిని టి.సుకన్యకు వర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. ఆమె ప్రొఫెసర్ ఎస్.కిశోర్ పర్యవేక్షణలో ×ఎవాల్యుయేషన్ ఆఫ్ బయోకెమికల్ పారామీటర్స్ ఇన్ స్ట్రెప్టొజొటాసిన్ (ఎస్టిజడ్) ఇండ్యూజ్డ్ టైప్ టు డయాబెటిక్ ర్యాట్ అసోసియేటెడ్ విత్ ద ట్రీట్‌మెంట్ ఆఫ్ మెట్ ఫార్మిన్ అలాంగ్ విత్ మెగ్నీషియం అండ్ విటమిన్ డ్జి అనే అంశంపై ఆమె పరిశోధన చేశారు.

మాధవం కార్మికులకు వైద్య పరీక్షలు

తిరుపతి తుడా: స్థానిక బస్టాండ్ సమీపంలోని టీటీడీకి చెందిన మాధవం రెస్ట్ హౌస్‌లో పనిచేసే హౌస్ కీపింగ్, ఈఎస్ఐ బీమా కార్మికుల కోసం గురువారం ఈఎస్ఐ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్య సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు ధనుంజయ రెడ్డి, ఉపేంద్ర కుమార్, హెడ్ నర్స్ జ్ఞానప్రసూన, సిబ్బంది హేమలత, పద్మజా రెడ్డి, విజయన్ పాల్గొన్నారు

క్షయ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి

తిరుపతి తుడా: 60 ఏళ్లు పైబడిన వారు , ధూమపానం చేసేవారు, మధుమేహం వ్యాధిగ్రస్తులు తరచూ క్షయ నిర్ధారణ పరీక్షలు చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీనివాసులు కోరారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ జనభగీరథ్ కార్యక్రమంలో భాగంగా ఆయన ఎన్జీఓ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. తిరుపతిని టీబీ రహిత జిల్లాగా చేయడానికి తమవంతు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికలాఫీసర్ డాక్టర్ రాజా నాయక్, తిరుపతి క్షయ నివారణ ఉద్యోగులు పాల్గొన్నారు.

కరెంటు స్తంభం నుంచి పడి గాయాలు

పాకాల: కరెంటు తస్తంభం నుంచి కింద పడి ఉద్యోగి గాయాల పాలైన సంఘటన గురువారం మండలంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. మద్దినాయనపల్లె సబ్‌స్టేషన్‌లో పని చేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్ భాస్కర్ చిన్నరామాపురం సమీపాన గొల్లవానివంక సమీపంలో విద్యుత్ స్తంభం ఎక్కి ఫ్యూజ్ మారుస్తుండగా విద్యుత్ ప్రమాదం జరిగి పైనుంచి కింద పడ్డాడు. ఈ ఘటనలో భాస్కర్ చెయ్యి కాలింది. కుడి కాలు విరిగినట్లు సమాచారం . అతడిని చికిత్స నిమిత్తం తిరుపతిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

6న బీసీల ఆత్మగౌరవ సభ

తిరుపతి కల్చరల్: బీసీల హక్కుల సాధనే లక్ష్యంగా ఈనెల 6న తిరుపతిలో నిర్వహించ తలపెట్టిన బీసీల ఆత్మగౌరవ సభకు బీసీలందరూ వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని బీసీ సంఘాల దక్షిణాది రాష్ట్రాల కన్వీనర్ ఆల్‌మెన్ రాజు, అంబేడ్కర్ పూలే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పరసా రత్నం పిలుపునిచ్చారు. పెద్దకాపు లే ఔట్‌లోని ఓ హోటల్లో గురువారం బీసీ సంఘాల నేతలు, బీసీల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇందిరామైదానంలో 6న సాయంత్రం 4 గంటలకు బీసీ ఆత్మగౌరవ భరోసా సభకు రాష్ట్రంలోని బీసీ మంత్రులు, ప్రజా ప్రతినిధులు, బీసీ జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు హాజరు కానున్నారని తెలిపారు. తొలుత మధ్యాహ్నం 2 గంటలకు బాలాజీ కాలనీలోని జ్యోతిరావ్ పూలే విగ్రహం నుంచి సభా వేదిక వరకు భారీ ర్యాలీ నిర్వహిస్తామన్నారు. సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల నేతలు విజయ్ ఉత్తరాది, జగదీష్, యాదగిరి, ధనశేఖర్, సుధాకర్, నాగార్జున, కుమార్‌రెడ్డి, స్టార్ కృష్ణ, బీసీ మహిళలు పాల్గొన్నారు.